అధికారుల అవినీతి మిషన్!

- చందలూరులో రూ.53 లక్షలతో జల్‌జీవన్ మిషన్ పనులు
- ఆరు కిలోమీటర్ల మేర పైపులైన్ల ఏర్పాటు
- 289 కుళాయిలకు లబ్ధిదారుల నుంచి రూ.1250 వసూళ్లు
- అక్రమ వసూళ్లకు తెరతీసిన పంచాయతీ


చందలూరులో పైపులైన్ల ఏర్పాటుకు తీసిన గుంతలు


ఇంటి ముందు ఏర్పాటు చేసిన పైపులైన్


రూ.1250 రసీదు ఇచ్చిన పంచాయతీ కార్యదర్శి

జే.పంగులూరు: ప్రతి ఇంటికి తాగునీరు అందేచే లక్ష్యంతో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి కుళాయిని ఉచితంగా అందించే లక్ష్యంతో ప్రారంభించారు. కాని పథకం ఉద్దేశం పూర్తిగా నీరు గారిపోయింది. సంపాదనే ధ్యేయంగా క్రాంట్రాక్టర్లు పనులు చేస్తుంటే, వారికి అధికారులు వత్తాసు పలుకుతూ వాటా పంచుకుంటున్నారు. మండల పరిధిలోని చందలూరు గ్రామంలో రూ. 53 లక్షలతో ఇంటింటికి మంచినీటి కుళాయి ఏర్పాటు చేయాలని నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల ద్వారా ప్రతి ఇంటికి పైపులైన్ల ద్వారా మంచినీరు అందివాల్సి ఉంది. దీనిలో భాగంగా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. పైపు లైన్‌కు కుళాయిని ఏర్పాటు చేసేందుకు లబ్ధిదారుని వద్ద నుంచి రూ.1250 వసూళ్లు చేస్తున్నారని లబ్ధిదారులు చెప్తున్నారు. గ్రామంలో 289 కుళాయిల్ని బిగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ పైప్‌లైన్ పనులు చేస్తున్న కాంట్రాక్టరే ఇంటి నుంచి డబ్బులు వసూలు చేయాలి. కాని అధికారులు ఆ బాధ్యతను తీసుకుని వసూళ్లు చేస్తున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా..

అధికారులు చెప్పిన విషయానికి వస్తే రూ. 53 లక్షల వ్యయంతో 6 కిలోమీటర్ల మేర పూర్తిగా పైపులైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కాని కొందరు రాజకీయ కక్షలతో గొట్టిపాటి బజారుకు పూర్తిగా మంచి నీటి పైపులైన్లు ఆపేశారు. ఆ బజారులో మొత్తం 14 మంచి నీటి కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని లబ్ధిదారులు వాపోయారు. ఈ విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు.

అధికారికంగా రూ. 1250 వసూళ్లు..

గ్రామంలో నిర్మిస్తున్న మంచి నీటి పైపులైన్లకు కుళాయి కనెక్షన్లకు డబ్బులు వసూళ్లకు సంబంధించి అధికారులు తోడ్పాటు అందిస్తున్నారు. గ్రామంలో వసూళ్లు చేస్తున్న రూ.1250 సంబంధించి తెల్లకాగితం ముక్కపై లబ్ధిదారుని పేరు, తండ్రి పేరు, వారు కట్టిన డబ్బులతో పాటు పంచాయితీ సీలు, పంచాయితీ కార్యదర్శి సంతకంతో డబ్బులు వసూలు చేస్తున్నారు.

"పైపులైన్లు ఏర్పాటుకు మాత్రమే నిధుల మంజూరు..

గ్రామంలో రూ. 53 లక్షలతో జల్‌జీవన్ మిషన్ ద్వారా పైపులైన్ల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. కుళాయిలు ఏర్పాటుకు సంబంధించి గతంలో ప్రతి ఇంటికి కుళాయి ఉన్నట్లు ఆన్‌లైన్‌లో నమోదై ఉన్నాయి. గ్రామం మొత్తం మీద 8 కుళాయిలు కొత్తవి బిగించమని మాత్రమే ఉంది. మిగిలిన రూ. 53 లక్షలతో గ్రామంలో 6 కిలో మీటర్లు మేర మంచినీటి పైపులైన్లు ఏర్పాటు చేస్తాం."

– రామాంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ

"వసూళ్లకు సంబంధించి మాకు తెలియదు..

పైపులైన్లతో పాటు కుళాయిని నిర్మించేందుకు కాంట్రాక్టర్ రూ. 1250 వసూళ్లు చేస్తున్నారని తెలిసింది. దానికి సంబంధించి మేము ఎలాంటి రసీదులు ఇవ్వలేదు. కేవలం లబ్ధిదారుడికి సంబంధించి అసెస్మెంట్ నెంబర్ మాత్రమే పేపరు ముక్కపై వేసి ఇచ్చాం."

– కళ్యాణి, పంచాయతీ కార్యదర్శి

"డబ్బులు ఇవ్వకుంటే కుళాయి కనెక్షన్ ఇవ్వమంటున్నారు..



గ్రామంలో ప్రతి ఒక్కరి వద్ద నుంచి రూ. 1250 వసూళ్లు చేస్తున్నారు. డబ్బులు ఇవ్వకుంటే కుళాయి కనెక్షన్ ఇచ్చేది లేదని చెప్తున్నారు. మా వద్ద నుంచి డబ్బులు కట్టించుకొని రసీదు ఇవ్వమంటే తెల్లకాగితం ముక్కపై రాసి కార్యదర్శి సంతకం పెట్టి ఇస్తున్నారు."

– పెంట్యాల వెంకటసుధాకరరావు

"మా బజారుకు పైపులైన్ కనెక్షన్ ఇవ్వలేదు..



టీడీపీ వచ్చిన నాటి నుంచి గ్రామంలోని గొట్టిపాటి బజారులో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గతంలో నూతన విద్యుత్ కనెక్షన్ గ్రామం అంతా ఇచ్చి ఒక మా బజారు వేయకుండా ఆపేశారు. ప్రస్తుతం ఇప్పుడు మంచినీటి పైపులైన్లు కూడా వేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకుపోయిన ప్రయోజనం లేకుండా పోయింది."

– కుంచాల సుబ్బారావు

గ్రావెల్ వాహనాల అడ్డగింత

యద్దనపూడి: ఒకటా రెండా.. ఒకే సారి వందలాది లారీలు ఆ గ్రామాలను చుట్టుముడుతున్నాయి. హారన్ల మోతలతో హడలెత్తిస్తున్నాయి. లారీలు వెళ్లినప్పుడల్లా భూకంపం వచ్చినట్లు అదిరి ఇళ్లు కదిలిపోతున్నాయి. అసలే మోకాలు లోతు గుంతల్లో ఉన్న రహదారుల్లో భారీ వాహనాలు వేగంగా వెళ్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయాందోళనల చెందుతున్నారు. పలుమార్లు వాహన డ్రైవర్లకు గ్రామస్తులు చెప్తున్నా పట్టించుకోకపోవటంతో మండలంలోని యనమదల గ్రామస్తులు సోమవారం టిప్పర్ లారీలను అడ్డుకున్నారు. 50 టన్నుల పైగా బరువు ఉన్న భారీ వాహనాల కారణంగా అసలే ఆధ్వానంగా ఉన్న రోడ్లు మరింత ధ్వంసం అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పట్టించుకోని అధికారులు

భారీ వాహనాల వల్ల ఇంటి ముందు నీళ్ల పైపులు పగులుతున్నాయని, చిన్నపిల్లలకు ప్రమాదం పొంచి ఉందని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికి పట్టించుకోవటం లేదని, తప్పనిసరి పరిస్థితుల్లో లారీలను అడ్డగించామని గ్రామస్తులు తెలిపారు. సంక్రాంతి కల్లా రోడ్లు మరమ్మతులు చేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం ఆ సంగతి మరచిపోయిందని గ్రామస్తులు విమర్శించారు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకొని తక్షణమే రోడ్లు మరమ్మతులు చేపట్టటంతో పాటు లారీల సమస్యను లేకుండా చేయాలన్నారు. లేని పక్షంలో రోడ్డుపై రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు.


టిప్పర్, లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

వడ్డెర జాతి ముద్దుబిడ్డ ఓబన్న


చినగంజాంలో ఓబన్నకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


వేటపాలెంలో మాట్లాడుతున్న వడ్డెర నాయకుడు సింగయ్య

వేటపాలెం: వడ్డెర జాతి ముద్దుబిడ్డ వడ్డే ఓబన్న అని.. వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మల్లెం అంజమ్మ కొనియాడారు. స్థానిక రైల్వే స్టేషన్ వద్ద స్వాతంత్ర్య పోరాట వీరుడు వడ్డే ఓబన్న వర్ధంతి సభ సోమవారం నిర్వహించారు. ముందుగా వడ్డే ఓబన్న చిత్రపటానికి పూల మాళలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓబన్న బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తొలి స్వాతంత్ర్య యోధుడన్నారు. ఆయన త్యాగం, ధైర్యం ఈ తరం యువతకు స్ఫూర్తిదాయకం అన్నారు. వడ్డెర యువజన నాయకుడు కుంచాల సింగయ్య ఓబన్న సేవలు గుర్తుచేశారు. అనంతరం మల్లం అంజమ్మ, తన్నీరు బసవయ్య, దేవర్ల లక్ష్మిలను ఘనగా సన్మానించారు. కార్యక్రమంలో వడ్డెర సంగం అధ్యక్షుడు మల్లెల శ్రీను, మల్లెల రవి, పల్లపు శ్రీను, చల్ల గంగరాజు, కుంచాల మంగారాజు, కుంచాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బ్రిటీషు వారితో పోరాడిన వడ్డే ఓబన్న..

చినగంజాం: స్వాతంత్ర్య యుద్ధానికి పూర్వం బ్రిటీషు వారి దుష్ట పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడు వడ్డే ఓబన్న చిరస్మరణీయుడు అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి అన్నారు. రేనాటి పాలెగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రధాన సైన్యాధిపతి వడ్డే ఓబన్న వర్ధంతిని సోమవారం నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఎం సునీల్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కొల్లాటి ఏడుకొండలు, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కొండూరి గోవింద్, ఎంప్లాయిస్, పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడు ఎంవీ రామారావు, మండల ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షలు పాదర్తి ప్రకాష్, జీ ఉమాశంకర్‌రెడ్డి, ఆసోది సూర్యనారాయణరెడ్డి, పఠాన్ బాబు, షేక్ సైదా, సాయి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం


అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు

చీరాల టౌన్: రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలకు ఉన్న రెవెన్యూ, ఇతర సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చీరాల ఆర్డీవో తూమాటి చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. సోమవారం చీరాల ఆర్డీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. డివిజన్ పరిధిలోని పలు శాఖల అధికారులతో కలిసి ప్రజల సమస్యలపై ఆర్డీవో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ప్రజలకు ఉన్న సమస్యలను అర్జీల రూపంలో అందిస్తే నిర్ణీత సమయంలోగా అర్జీలను విచారించి పరిష్కారం చూపుతామన్నారు. ప్రజలు సమస్యలపై నేరుగా వచ్చి తనను కలవచ్చని ప్రతీ అర్జీదారునికి సత్వర న్యాయం చేయడమే లక్ష్యమన్నారు. పీజీఆర్ఎస్‌లో సమస్యలపై 18 అర్జీలు అందించారు. అలానే చీరాల తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో తమ సమస్యల పరిష్కారం కోసం 17 అర్జీలను తహశీల్దార్ కె.గోపికృష్ణకు అందించారు.

నేడు సెయింటాన్స్‌లో క్యాంపస్ సెలక్షన్స్

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఫార్మసిలో దివీస్ ల్యాబోరేటరీస్ వారిచే కళాశాలలో క్యాంపస్ సెలక్షన్స్ మంగళవారం నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలకు బీ ఫార్మసి, ఎం ఫార్మసి, ఎంఎస్సీ, బీఎస్సీ, బీటెక్ (కెమిస్ట్రీ) బీఎస్‌సీ (కెమిస్ట్రీ) బీటెక్ (మెకానికల్), ఈఈఈ బ్రాంచీలు, డిప్లొమా, ఎస్ఎస్‌సీ, 2023, 2024, 2025 విద్యా సంవత్సరంలో ఏ కళాశాలలో నైనా పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా అద్దంకమ్మ తల్లి తిరునాళ్లు


సామూహికంగా పొంగళ్ల నివేదన చేస్తున్న భక్తులు

చీరాల టౌన్: కోరిన కోర్కెలు తీర్చి గ్రామాన్ని సుభిక్షంగా ఉంచే పాత చీరాల అద్దంకమ్మ తల్లి వార్షికోత్సవ తిరునాళ్లు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. గత నాలుగు రోజులుగా చేస్తున్న వేడుకల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు చేశారు. అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు, ఊయల సేవ, గ్రామస్తులకు అన్న సమారాధన, పొంగళ్ల సేవ, జల బిందెలతో గ్రామోత్సవం, పసుపు–కుంకుమ బండ్లు ఊరేగింపు వేడుకలకు వైభవంగా జరిపించారు. గత 15 ఏళ్లు అద్దంకమ్మ తల్లి వార్షికోత్సవ తిరునాళ్లను నిర్వహిస్తున్నారు. వేడుకలను అద్దంకమ్మ తల్లి దేవస్థాన సేవా కమిటీ పర్యవేక్షించగా వేలాది మంది భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.


పసుపు–కుంకుమలతో ఊరేగింపు చేస్తున్న భక్తులు

వర్షపు నీటితో కొండాయపాలెం వాసుల విలవిల


కొండాయపాలెం పాఠశాలలోకి వెళ్లే దారిలో నిల్వ ఉన్న వర్షపునీరు


గ్రామంలోకి వెళ్లే రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

బల్లికురవ:

కొద్దిపాటి వర్షం కురిసిన అవస్థలు తప్పడం లేదు. ఆదివారం రాత్రి కొండాయపాలెం గ్రామంలో కురిసిన వర్షానికి గ్రామం చుట్టూ నీరు చేరింది. గ్రామం చుట్టూ గ్రానైట్ క్వారీలు ఉన్నా అభివృద్ధి అంతంత మాత్రమే. చెన్నుపల్లి–అనంతవరం ఆర్ అండ్‌బీ రోడ్డులో నుంచి కొండాయపాలెం గ్రామానికి చేరుకోవాలి. ఒకవైపు కొద్దిపాటి వర్షం కురిసినా డౌన్ సప్టాపై 2 అడుగుల నుంచి 5 అడుగుల వరకు వర్షపు నీరు ప్రవహిస్తూ ఉంటుంది. మరో వైపు గ్రానైట్ క్వారీల నిర్వాహకులు రోడ్డును తమ ఆధీనంలోకి తీసుకోవటంతో బురదతో జారుడు బల్లను తలపిస్తుంది. ప్రాథమిక పాఠశాలలోకి వెళ్లే దారిలో వర్షపు నీటితో విద్యార్థులు సోమవారం పాఠశాలకు వెళ్ల లేకపోయారు. పాలకులు అధికారులు వర్షపు, మురుగు నీరు నిల్వలేకుండా చర్యలతో పాటు ప్రధాన రోడ్డుకు ఇరువైపుల సైడుకాల్వల నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

ప్రమాదకరంగా కప్పల వాగు


కప్పలవాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్‌ఐ జీ సురేష్

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని పూసపాడు గ్రామ పరిధిలోని కప్పల వాగు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటి ప్రవాహంతో ఉధృతంగా ప్రవహిస్తుందని ప్రజలు, వాహనదారులు అప్రమత్తంగా ఉండి జాగ్రత్త పాటించాలని తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్, ఎస్‌ఐ జీ సురేష్‌లు సూచించారు. సోమవారం వారు కప్పలవాగు ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. వాగు వద్ద ప్రమాదాలను నివారించేందుకు రెవెన్యూ, పోలీస్ శాఖల సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. వర్షాకాలంలో ప్రతి సారి వాగు ఉధృతి పెరగడంతో రాకపోకలు స్తంభిస్తున్నాయని సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు.

విద్యార్థులకు శారీరక, మానసిక ఆరోగ్యం అవసరం


ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు శారీరక, మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని ఎంఈవో ఎంవీ సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల అవరణలో వరల్డ్ మెంటల్ హెల్త్ వీక్ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల పోషకాహారాలతో పాటు, మంచి ప్రొటీన్ ఫుడ్‌ను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా కెరీర్ గైడెన్స్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ జీ విమోల్యకుమారి, హెచ్ఎం జీ సామ్రాజ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజన ప్లేట్లు బహూకరణ


భోజన ప్లేట్లు బహూకరిస్తున్న ప్రిన్సిపాల్ పుష్పరాజు

చీరాల రూరల్: స్థానిక విజయనగర్ కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 60 మంది విద్యార్థులకు సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజు తన తల్లి దండ్రులు పద్మారావు, పుష్పలీల జ్ఞాపకార్థం భోజన ప్లేట్లు ఉచితంగా అందజేశారు. హెచ్ఎం డానియేల్ ఐజాక్సన్ తన దృష్టికి తీసుకురావడంతో తమవంతు సాయంగా బహూకరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. దయాశేఖర రత్నరాజు, బండి బిక్షాలు పాల్గొన్నారు.

అధ్వానంగా బల్లికురవ–మార్టూరు రోడ్డు


కూరుకుపోయిన బస్సు

బల్లికురవ: నాగరికతకు చిహ్నాలైన రహదారులు మోకాటిలోతు గోతులతో అధ్వానస్థితికి చేరాయి. సోమవారం అద్దంకి డిపో నుంచి బల్లికురవ–కొణిదెన–మార్టూరు మీదుగా చిలకలూరిపేట వెళ్లే బస్సు కొణిదెన మార్టూరు మధ్య గోతుల్లో కూరుకుపోయింది. ఈ మార్గంలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది, బల్లికురవ–నాగరాజుపల్లి–మార్టూరు రోడ్డుకూడా అధ్వానస్థితికి చేరింది. మండలంలోని పాఠశాలలు, సచివాలయాలు, తహసీల్దార్ మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులంత చిలకలూరిపేట, మార్టూరు నుంచి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధాన రోడ్లు రెండూ అధ్వానస్థితికి చేరటంతో సకాలంలో విధులకు హాజరు కాలేకపోతున్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు చేరిన వృద్ధుడు

చీరాల అర్బన్: ఏడు సంవత్సరాల క్రితం ఇంటి నుంచి తప్పిపోయిన వృద్ధుడిని శక్తి టీం పోలీసులు తిరిగి కుటుంబ సభ్యులకు సోమవారం చేర్చారు. గుంటూరు జిల్లా చిలుకూరుకు చెందిన పఠాన్ బాషా ఏడేళ్ల క్రితం ఇంటి నుంచి తప్పిపోయాడు. మతిస్థిమితం లేక చీరాల, బాపట్ల ప్రాంతాలలో తిరుగుతున్నాడు. చీరాల ప్రభుత్వ వైద్యశాలలో వృద్ధుడిని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వృద్ధుడి ఆచూకి తెలుసుకున్న శక్తి టీం పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు చీరాల వచ్చారు. వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పర్చూరు(చినగంజాం): కూటమి ప్రభుత్వం అధికారిలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కాలేదని బాపట్ల జిల్లా హిందీ టీచర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ హనుమంతరావు, శివ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు కానీ, 12వ పీఆర్సీ ఏర్పాటు చేయడం కానీ, నాలుగు డీఏలు పెండింగ్ కానీ, కరోనా కాలంలో మరణించిన ఉపాధ్యాయుల పిల్లలకు నేటికి కారుణ్య నియామకాలు జరపక పోవడం కానీ చేయలేదన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని వారు కోరారు.

పాల్‌రాజ్‌కు వరికూటి పరామర్శ



చీరాల అర్బన్: వైఎస్సార్ సీపీ నాయకుడు పేరాల ఆనందపేటకు చెందిన పేర్లి నాని తండ్రి పేర్లి పాల్‌రాజు అనారోగ్యానికి గురై చీరాలలోని గోరంట్ల సూపర్ స్పెషాలిటి హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా సోమవారం వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ డాక్టర్ వరికూటి అమృతపాణిలు వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

సమావేశానికి తరలివెళ్లిన నాయకులు

కారంచేడు: జిల్లా కేంద్రమైన బాపట్లలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశానికి కారంచేడు మండలంలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు తరలివెళ్లారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరైన సమావేశానికి పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదనరెడ్డి సూచనలతో వివిధ కేడర్ నాయకులు వెళ్లారు. నియోజకవర్గ మహిళా కన్వీనర్ జువ్వా కోమలి, వైఎస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, మాజీ వైస్ ఎంపీపీ యార్లగడ్డ వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో నాయకులు వెళ్లారు.


నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీరాల అర్బన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం చీరాల దండుబాట రోడ్డు, జయశంకర్‌నగర్, పాలేటినగర్, ఉజిలిపేట, ప్రకాష్‌నగర్ వాటర్ ట్యాంక్ బజారు తదితర ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీ2 సెక్షన్ ఏఈ బి.శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్ సిబ్బంది వివరాల మేరకు.. స్థానిక రాజుపాలెం జంక్షన్‌లో ఫ్లై ఓవర్ నిర్మాణం జరుగుతూ ఉండటంతో ఒంగోలు, గుంటూరు రెండు వైపులా వెళ్లే వాహనాలు గత కొంతకాలంగా సర్వీస్ రోడ్డులో ఎదురెదురుగా ప్రయాణిస్తున్నాయి. ఈ క్రమంలో చిలకలూరిపేట వైపు ఇద్దరు యువకులు ప్రయాణిస్తున్న బైకు వ్యతిరేక దిశలో ఒంగోలు వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొన్నాయి. ప్రమాద తీవ్రతకు బైకు వెళుతున్న ఇద్దరు యువకులు రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది ఇద్దరు యువకులను చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. క్షతగాత్రులు ఇరువురు అపస్మారక స్థితిలో ఉండటంతో వారి వివరాలు తెలియ రావాల్సి ఉందని సిబ్బంది తెలిపారు

ఆధునిక గ్రంథాలయాలపై వ్యాసరచన పోటీలు



అద్దంకి రూరల్: అద్దంకి గ్రంథాలయ భవన సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం ఆధునిక గ్రంథాలయాలు ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 129 మంది పాల్గొన్నారు. కార్యక్రమానికి అద్దంకి మండల విద్యాశాఖాధికారి కెవీ శ్రీనివాసరావు, బొమ్మనంపాడు జెడ్పీ పాఠశాల హెచ్ఎం సీహెచ్‌వీ శ్రీనివాసమూర్తి పర్యవేక్షించారు. పోటీల్లో గెలపొందిన విద్యార్థులకు ఈనెల 11 వతేదిన బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారంలో అశ్రద్ధ తగదు

చీరాల టౌన్: ప్రజలకు ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది అలసత్వం వహించకుండా నిబద్ధతతో పనిచేయాలని తహశీల్దార్ కుర్రా గోపికృష్ణ సూచించారు. రెవెన్యూ కార్యాలయంలోని సమావేశ హాలులో సోమవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీటీ సూర్యనారాయణ, ఆర్ఐలు, వీఆర్వోలు ఉన్నారు.